క్లుప్తంగా

నేడు అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రత్తిపాడు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న జొన్నలగడ్డ మెయిన్, పమిడివారి పాలెం, వట్టిచెరుకూరు బీసీ అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకురాలి పోస్టుకు శుక్రవారం ఇంటర్వ్యూల్ని నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు సీడీపీవో వి. సుజాతాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు మహిళా ప్రాంగణంలోని సఖి సెంటరులో జరగనున్న ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు హాజరుకావాలని ఆమె సూచించారు.

నాడు-నేడు పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలి



గరికపాడు(కాకుమాను): నాడు-నేడు పనుల్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఎంఈవో కెఎఫ్.కెనడీ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని గరికపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనుల్ని గురువారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతుల్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు శాకంబరీదేవిగా అమ్మవారు



పెదకాకాని: శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఏసీ ఎస్. శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. భక్తులు సమర్పించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారితో పాటు ఆలయాన్ని నయనానందకరంగా అలంకరించినట్లు చెప్పారు. శాకంబరీదేవి అలంకరణలో శ్రీ భ్రమరాంబ అమ్మవారు శుక్రవారం నుంచి ఆదివారం వరకూ దర్శనమిస్తారని వారు పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

జీజీహెచ్ సిబ్బందిపై దాడి

పట్నంబజారు: జీజీహెచ్ సిబ్బందిపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు కర్రతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12వ తేదీ రాత్రి జీజీహెచ్‌లోని ప్రసూతి వార్డులో తాడికొండ మండలం ఉంగుటూరు గ్రామానికి చెందిన బుల్లా రవి బాబు పూటుగా మద్యం తాగి తిరుగుతూ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్న బి. రామలక్ష్మిని, స్టాఫ్ నర్స్‌లను, సెక్యూరిటీ సూపర్‌వైజర్ గేరా బుజ్జిని దుర్భాషలాడటంతో పాటు కర్ర తీసుకుని వారిపై దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌కు కాఫీ మిషన్ బహూకరణ

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి గురువారం బసవపున్నయ్య జ్ఞాపకార్థం ఆయన తనయుడు కాఫీ మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రికి గతంలో కూడా మినరల్ వాటర్ కూలర్ అందచేశారని గుర్తు చేశారు. తండ్రి జ్ఞాపకార్థం తనయులు ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని తెలిపారు. సూపరింటెండెంట్ కార్యాలయానికి వచ్చే రోగుల సహాయకులకు కాఫీ, టీ ఇచ్చేందుకు మిషన్ ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

పట్నంబజారు: ఆన్‌లైన్‌లో నగదు అపహరించిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొత్తూరివారితోటకు చెందిన ఠాగూర్ భవానీసింగ్ ఈ నెల 10న గూగుల్‌పే ఉపయోగించి ఫోన్ రీచార్జ్ చేసేందుకు ప్రయత్నించారు. అది కాకపోవడంతో గూగుల్ కస్టమర్ కేర్ కోసం ఆన్‌లైన్‌లో వెతుకే ప్రయత్నం చేయగా, గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. ఎనీ డెస్క్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని చెప్పాడు. భవానీసింగ్ నుంచి వివరాలు తెలుసుకుని, ఓటీపీ అడగ్గా ఆయన చెప్పారు. అనంతరం 11న భవానీసింగ్ అకౌంట్‌లోని రూ. 90వేల నగదు అపహరణకు గురవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న సురక్షతో పేదలకు రక్ష

జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు

గుంటూరు రూరల్: జగనన్న సురక్షతో పేదలకు రక్ష లభిస్తుందని రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలోని మల్లవరంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతికి కోసం అనేక సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారని, విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు తెచ్చారని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సాంకేతిక సమస్యలకు సైతం సత్వర పరిష్కారం చూపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా 464 రకాల సేవల్ని ప్రజలకు అందించారు. 190 కుల, 160 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 10 పంటసాగు హక్కు పత్రాలు, 15 మందికి ఆధార్ సేవలు, ఇద్దరికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ. సుబ్రహ్మణ్యం, డెప్యూటీ తహసీల్దారు బిట్టు రమేష్, వైస్ ఎంపీపీ దర్శి సుజాత, మల్లవరం గ్రామ సర్పంచ్ ఏరువ పద్మావతి, తోకావారిపాలెం సర్పంచ్ దొడ్డా సామ్రాజ్యం, గోర్లవారిపాలెం సర్పంచ్ నల్లమేకల అప్పమ్మ, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ దగ్గుల మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మల్లవరంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు తదితరులు

అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ పథకాలు

ప్రత్తిపాడు: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎంపీడీవో ఏ. శ్రీరమ్య తెలిపారు. మండలంలోని యనమదల సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. లబ్ధిదారులకు సర్వీసు చార్జీలు లేకుండా ఉచితంగా ధ్రువీకరణ పత్రాల్ని అందించారు. అనంతరం ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వలంటీర్లు గ్రామంలో ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నారన్నారు. అర్హత ఉండీ పథకాలు అందని వారిని గుర్తించి, వారికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నారని చెప్పారు. ముందుగా టోకెన్లు జారీ చేసి క్యాంపుల్లో మొత్తం తొమ్మిది రకాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామని వివరించారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జి. ఆదినారాయణ, ఏవో అరుణకుమారి పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్న సురక్ష దోహదం

పెదకాకాని: సమస్యల సత్వర పరిష్కారానికే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నంబూరు, ఉప్పలపాడు సచివాలయాల వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఉప్పలపాడులో నిర్వహించిన శిబిరంలో ఎంపీపీ మాట్లాడుతూ పథకాలకు అర్హత కలిగి ఉండి సాంకేతిక కారణాల కారణంగా లబ్ధి పొందని వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని వివరించారు. లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం లబ్ధిదారులకు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఉప్పలపాడు శిబిరంలో తహసీల్దార్ పి. రత్నం, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ శివాబత్తుని దయానంద్, సభ్యుడు పల్లెంపాటి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు. నంబూరు సచివాలయం వద్ద నిర్వహించిన శిబిరంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీడీవో బి.వి. మల్లేశ్వరరావు, సర్పంచి నంబూరు జ్యోతి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని, పంచాయతీ కార్యదర్శి షేక్ సుభాని, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దకే అన్ని సేవలు

గరికపాడు(కాకుమాను): ఇంటి వద్దకే ప్రజలకు అన్ని ప్రభుత్వ సవల్ని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం తెలిపారు. మండలంలోని గరికపాడు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ ప్రజలు వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకండా గ్రామాల్లోనే అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష అనే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. తెలగాయపాలెం సర్పంచ్ చింతల రాహేలమ్మ మాట్లాడుతూ అనునిత్యం రాష్ట్ర ప్రజల క్షేమం కోరే ఏకైక నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఆమె కొనియాడారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా గ్రామంలోనే పైసా ఖర్చు లేకుండా 11 రకాల సర్టిఫికెట్లను ఐదు నిమిషాల్లోనే అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా పలువురికి వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీవో రామకృష్ణ, ఏవో కె.కిరణ్మయి, ఏపీవో సింగారావు, ఏపీఎం సోమశేఖర్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మంచాలలో పత్రాలను అందజేస్తున్న సర్పంచ్ సాంబశివరావు, ఎంపీడీవో

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

చేబ్రోలు: మండలంలోని మంచాల, నారాకోడూరు-1 గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాల్ని నిర్వహించారు. మంచాల సచివాలయం పరిధిలో జరిగిన సమావేశంలో గ్రామ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం జగనన్న సురక్ష చేపట్టినట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని తెలిపారు. ఇంటింటి సర్వే ద్వారా దరఖాస్తు చేసుకున్న 379మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. నారాకోడూరు-1 గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు కె.వి. గోపాలకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సాంకేతిక, ఇతర కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారికి కూడా లబ్ధి చేకూర్చడమే లక్ష్యమని చెప్పారు. అనంతరం వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల్ని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం వి. నాగేశ్వరరావు, ఎంఈవో జె.సుబ్బారావు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నంబూరులోపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, అధికారులు



ప్రత్తిపాడులో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీడీవో శ్రీరమ్య



గరికపాడు అర్జీదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు,అధికారులు



ఉప్పలపాడులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తదితరులు

ముఖ్యమంత్రి జగన్‌కు అర్చకులు రుణపడి ఉంటారు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరి సతీష్‌శర్మ

గుంటూరు రూరల్: టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్చకులకు దూరమైన వంశపారంపర్య అర్చకత్వాన్ని కల్పించి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బ్రాహ్మణ జాతికి ఎంతో మేలు చేశారని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరి సతీష్‌శర్మ పేర్కొన్నారు. నగర శివారులోని ఇన్నర్ రింగ్ రోడ్డులో గల సమాఖ్య కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలీచాలని జీతాలతో బతుకు దుర్భరంగా మారిన అర్చకులు పాదయాత్ర చేస్తున్న సమయంలో జగన్‌కు వారి బాధలు, ఇబ్బందుల్ని తెలిపారన్నారు. ముఖ్యమంత్రి అవ్వగానే అర్చకుల సమస్యల్ని పరిష్కరిస్తానని అని ఆనాడు ఇచ్చిన హామీకి అనుగుణంగా ఒక్కొక్కటి నెరవెరుస్తున్నారని చెప్పారు. అర్చకుల వయోపరిమితిని తొలగించాలని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కలను నేడు సీఎం జగన్ సాకారం చేశారని పేర్కొన్నారు. దేవదాయ ఉద్యోగుల వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ కేబినెట్‌లో ఆమోదించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర వ్యాప్తంగా అర్చకులు, దేవదాయ శాఖ ఉద్యోగుల కుటుంబాలు రుణపడి ఉంటాయని కోనూరి సతీష్‌శర్మ తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సహకారంతో బాలికల కళాశాలకు ఉచితంగా పుస్తకాలు, వాహన సౌకర్యాలు, యూనిఫాం, ఫీజులు లేకుండా విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ ఆచారి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జీఎస్ఆర్ స్కూల్ డైరెక్టర్ జి. శివారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, కుర్రి సాంబిరెడ్డి, కుర్రి పుల్లారెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, దేవగిరి గంగాధరరెడ్డి, వజ్రాల వెంకటేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు

గురుకుల పాఠశాలకు ఇన్‌వర్టర్, ఎల్ఈడీ బల్బుల బహూకరణ

కాకుమాను: స్థానిక గురుకుల(బాలికల)పాఠశాలకు గురువారం పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్‌బాబు రూ.లక్షన్నర వ్యయంతో ఇన్‌వర్టర్, చార్జింగ్ ఎల్ఈడీ బల్బులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులంతా చిన్న వయస్సు నుంచే కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు గ్రామాభివృద్ధికి, రైతుల క్షేమం కోసం సహాయ, సహకరాలు అందిస్తానని చెప్పారు. ఇటీవల కాకుమాను ఎస్టీ కాలనీలో రూ.40 లక్షలతో కళ్యాణ మండపం, కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టి తెలిపారు. పనులు కూడా త్వరలోనే పూర్తి కానున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కె.సువార్త విజయ స్వర్ణ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



పరికరాలతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నగరంలో శరవేగంగా అభివృద్ధి పనులు: మేయర్

నెహ్రూనగర్: నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలోని 20వ డివిజన్ పార్వతీపురంలో రూ. 45 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటికే రామనామక్షేత్రం ప్రధాన రహదారి విస్తరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనుల్ని కుల, మత, పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో రహదారుల విస్తరణ చేస్తున్నట్లు తెలిపారు. తమ పాలకవర్గం ఏర్పడ్డాక నగరపాలక సంస్థ పరిధిలో రూ. 200 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారని, అంతేకాకుండా నగరాభివృద్ధికి కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని మేయర్ వివరించారు. నగరాభివృద్ధికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధుల్ని కలుపుకొని వెళ్తామని, వారి అభిప్రాయాల మేరకు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు కూడా పనుల్ని నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని ఆయన చెప్పారు. అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని మేయర్ సూచించారు. కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ 20వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు కంతేటి శ్యాంశేఖర్, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్

శ్రీనివాసరావుపేట శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు

నగరంలోని శ్రీనివాసరావుపేట హిందూ శ్మశానవాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ. 6 కోట్లతో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనుల్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని శ్మశానాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. శ్రీనివాసరావుతోటలోని వాటికను నగరంలోని ఎనిమిది డివిజన్లకు చెందిన సుమారు లక్ష మంది ప్రజలు వినియోగిస్తున్నారని తెలిపారు. వారి ఆకాంక్ష మేరకు శ్మశానవాటికలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం కర్మకాండలు నిర్వహించడానికి బస్టాండ్ వద్ద గల సత్రాన్ని వినియోగిస్తున్నారన్నారు. ఇకనుంచి శ్మశానవాటికలోనే చేసుకోవడానికి వీలుగా సత్రాన్ని నిర్మిస్తున్నామని మేయర్ వెల్లడించారు. నగరంలో శ్మశానాల అభివృద్ధికి స్వచ్ఛంద సేవా సంస్థల సహాయ, సహకారాలు కూడా తీసుకుంటామని మేయర్ చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వరాహం.. స్వైరవిహారం

- ప్రత్తిపాడులో భారీగా పందుల సంచారం
- గతంలో నిషేధిస్తూ ఆజ్ఞలు
- నియంత్రణలో విఫలమవుతున్న పంచాయతీ అధికారులు
- ప్రజలు రోగాల బారిన పడే అవకాశం?

ప్రత్తిపాడు: వరాహాల్ని కట్టడి చేయడంలో ప్రత్తిపాడు పంచాయతీ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. అత్యంత ప్రమాదకరమైన ప్రాణాంతక మెదడువాపు వ్యాధి బారిన పడే అవకాశం ఉందంటూ ఓ పక్క వైద్య, ఆరోగ్య శాఖ చెబుతున్నా వాటిని నియంత్రించడంపై పంచాయతీ అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రంలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. చెత్తాచెదారాల్లో కలియతిరుగుతూ ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.



ప్రత్తిపాడులోని చెత్తకుప్పల్లో సంచరిస్తున్న పందుల మూక

నిషేధాజ్ఞల అమలు ఎక్కడ?

ప్రత్తిపాడు గ్రామంలో పందులు సంచరించడాన్ని నిషేధిస్తూ గతంలో పంచాయతీ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. పెంపకందారుల్ని పిలిపించి హెచ్చరికలు కూడా చేశారు. కానీ ఉపయోగంలేకుండా పోయింది. ఇటీవల వరాహాల సంచారం ఎక్కువైంది. ప్రధాన రహదారితో పాటు పలు కూడళ్లలో ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. కానీ పెంపకందారులు మాత్రం పందుల్ని విచ్చలవిడిగా గ్రామంలోనికి వదిలేస్తున్నారు. దీంతో ప్రజలు ఎక్కడ రోగాల బారిన పడాల్సి వస్తుందేమోనని భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలవురు కోరుతున్నారు.

నోటీసులిచ్చాం

ఇప్పటికే పందుల సంచారంపై పలు ఫిర్యాదులు అందుతున్నాయి. ఇటీవలే పెంపకందారులకు నోటీసులు ఇచ్చాం. పాఠశాల పరిసరాల్లోనూ పంది మాంసం విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించాం. మరోసారి పెంపకందారుల్ని పిలిపించి మాట్లాడుతాం.

– జాన్ పీరా (పంచాయతీ కార్యదర్శి)

నగర సమగ్రాభివృద్ధికి పాలకవర్గం ఎనలేని కృషి

నెహ్రూనగర్: నగర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గం ఎనలేని కృషి చేస్తోందని స్టాండింగ్ కమిటీ చైర్మన్, నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. ఆయన చాంబర్‌లో గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. నగరంలోని అన్ని డివిజన్ల ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించిన అంచనాలు, అధికారులు ప్రతిపాదనలు చేసిన 215 అభివృద్ధి పనులపై స్టాండింగ్ కమిటీ సభ్యులు, నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో విపులంగా చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు నగరంలో గుర్తించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు డివిజన్ల వారీగా ప్రాధాన్యతక్రమంలో ఆమోదం తెలిపినట్లు చెప్పారు. విలీన గ్రామాల్లో నూతనంగా సీసీ డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం తెలిపామని పేర్కొన్నారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు నిమ్మల వెంకటరమణ, పడాల సుబ్బారెడ్డి, బొడ్డుపల్లి స్మిత పద్మజ, షేక్ జుమ్మాబి, మల్లవరపు రమ్య, అదనపు కమిషనర్ పెద్ది రోజా పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం

ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో ఈనెల 1నుంచి 5 వరకు జాతీయస్థాయి వాకో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగమైన మ్యూజికల్ ఫార్మ్ కర్రసాము పోటీల్లో ఆంధ్ర క్రీడాకారులు కొర్రపాటి చంద్రశేఖర్, ఖరీదు సాంబయ్య, పత్తి పవన్ కుమార్, మట్టుపల్లి తరంగణి సింగ్ బృందం నాలుగు బంగారు, మూడు రజిత పతకాలు సాధించింది. క్రీడాకారులంతా నవంబర్‌లో పోర్చుగల్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఇందులో వెనిగండ్ల రైతు భరోసా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పత్తి పవన్‌కుమార్ గురువారం రాత్రి ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులంతా పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. విద్య, ఉద్యోగాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జాతీయ స్థాయి కర్రసాము పోటీల్లో గోల్డ్, బ్రాంజ్ మెడల్ సాధించిన పవన్‌కుమార్‌ను శాలువాతో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఘనంగా సత్కరించారు.



క్రీడాకారుడు పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

16న ఇంటర్ ప్రతిభావంతులకు మాస్టర్ మైండ్స్ ప్రతిభా పురస్కారాలు

గుంటూరు ఎడ్యుకేషన్: నగర పరిధిలోని వివిధ జూనియర్ కళాశాలల్లో జూనియర్ ఇంటర్ చదివి, ఏప్రిల్ 26న ప్రకటించిన ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 16న ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ గురువారం తెలిపారు. స్టేట్ సిలబస్‌లో ఎంపీసీ గ్రూప్‌లో 450, బైపీసీ గ్రూప్‌లో 420, ఎంఈసీలో 470, సీఈసీలో 450కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం సాయంత్రం 5.00 గంటలకు బ్రాడీపేట 4/11లోని వజ్రం హోటల్ పక్కన ఉన్న మాస్టర్ మైండ్స్ బాలాజీ క్యాంపస్‌లో పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి హాజరు కాగోరు విద్యార్థులు ముందుగా పేర్లు నమోదు చేసుకుని, తల్లిదండ్రులతో పాటు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట ఆధార్ కార్డు, ఇంటర్ మార్కుల జాబితా ఇంటర్నెట్ కాపీ తీసుకుని రావాలని సూచించారు. ప్రతిభా పురస్కారాల సర్టిఫికెట్‌తో పాటు జ్ఞాపిక, నగదు బహుమతి అందజేస్తామని మోహన్ తెలిపారు. పేర్ల నమోదుకు 8978180847, 9248722218 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.